క్లుప్తంగా

18న మండల సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య బుధవారం తెలిపారు. ఎంపీపీ రమేష్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి రికార్డులతో హాజరు కావాలని ఆయన కోరారు. ఈ విషయంపై ప్రజాప్రజాప్రతినిధులు అందరికి కూడా సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

27, 28 తేదీల్లో సోమాలమ్మ జాతర



సోమాలమ్మ అమ్మవారు

అడ్డతీగల: మన్యం ప్రజల ఆరాధ్యదైవం సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 27, 28 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న అమ్మవారి ఘటం ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు. జాతర రెండు రోజులు అమ్మవారికి విశేష పూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా భజన సంఘాలచే భక్తి గీతాల ఆలాపన వంటివి ఏర్పాటు చేశామన్నారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని కోరారు.

పశువులకు టీకాలు



కురిడిలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ(అరకులోయ టౌన్): మండలంలో కురిడి పంచాయతీలో నారింజవలస, జంగిడివలస, అరకు పంచాయతీలో పశుసంవర్ధక శాఖ డాక్టర్ రాజాశ్రీ ఆధ్వర్యంలో బుధవారం పశుసంవర్ధక శాఖ సహాయకులు పశువులకు రోగనిరోధక టీకాలు వేశారు. పశువులకు, రోగాలు ప్రబలకుండా ముందస్తుగానే అవసరమైన చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామల్లో విస్తృతంగా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ సచివాలయం సహాయకులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

ఎటపాక: వయోజన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై వైద్యశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నెల్లిపాక పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుల్లయ్య , రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమేష్ పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బీసీజీ టీకా సెషన్ సెట్‌ల స్థితి, లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. వ్యాక్సినేషన్ యాక్షన్ ప్లాన్, టీకా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 65 సంవత్సరాలు పైబడిన వారుగర్,బీపి,టీబి వ్యాదికి గురైన వారు బీసీజి టీకా తప్పక వేయించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు, సైపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట పీహెచ్‌సీ పరిధిలోని దాయర్తి, రాచకీలం, మద్రేబు గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారులు వెంకటేష్, రూప్‌చంద్ గిరిజనులకు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఆరోగ్య సూత్రలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాలని, వేడినీటిని సేవించాలని సూచించారు. పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకుంటూ నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వైద్యసిబ్బంది సావిత్రి, విజయ, పుష్ప, శ్రావణి, రాంబాబు పాల్గొన్నారు.

ప్రగతి బాట.. రూడకోట

- రెండేళ్లల్లో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు
- ఏడు గ్రామాలకు రూ.81 లక్షలతో రోడ్లు
- ఆరు గ్రామాలకు తాగునీటి సదుపాయం
- బర్త్ వెయిటింగ్ హాల్, డాక్టర్, సిబ్బందికి క్వార్టర్స్
- నాడు–నేడు ద్వారా పాఠశాలల పురోగతి
- వీధి దీపాల ఏర్పాటు



రూడకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల



ముక్కిపుట్టు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం



కుజభంగి నుంచి రూడకోట వరకు తారురోడ్డు



బొర్లాడ గ్రామంలో ఇంటింటా కుళాయి ద్వారా నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తురాలు

పెదబయలు: మండలంలోని రూడకోట పంచాయతీ రాజకీయంగా మంచి పేరు ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉండేది... గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ కేంద్రంలోని సరైన రహదారులు ఉండేవి కావు.. తాగునీటి ఇబ్బందులతో సతమతమయ్యేవారు.. ప్రభుత్వ పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉండేవి... జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఏడాదిన్నర కాలంలోనే రూడకోట పంచాయతీలోని శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి జరిగింది. పంచాయతీ ప్రగతికి బాటలు పడుతోంది.14 గ్రామాల్లో, 2200 మంది జనాభా,1486 మంది ఓటర్లు ఉన్నారు.

శివారు గ్రామాలకూ సీసీ రోడ్లు

సచివాలయం పరిధిలో ఏడు గ్రామాలకు ముక్కిపుట్టు గ్రామంలో రూ.85 లక్షలతో సీసీరోడ్డు, కుమ్మరిపుట్టు రూ.5 లక్షలు, పాత రూడకోట రూ.11.50 లక్షలు,కొత్తరూడకోట రూ.16 లక్షలు, బడంబీరు రూ. 17లక్షలు,కష్టాపురం రూ.3 లక్షలు, రుండలంపుట్టు రూ.20లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. పంచాయతీలో పరిధిలోని బాబుశాల మెయిన్ రోడ్డు నుంచి ముక్కిపుట్టు బొర్లాడ వరకు తారురోడ్డు రూ.75 లక్షలు ప్రగతిలో ఉంది. సంత దుకాణం నుంచి కొత్త రూడకోట వరకు తారురోడ్డు రూ.40 లక్షలతో నిర్మాణం, అలాగే గ్రావెల్ రోడ్డు కొత్త రూడకోట నుంచి కృష్ణాపురం మీదుగా ముక్కిపుట్టు రూ.38 లక్షలతో రోడ్లు నిర్మాణం, బండంభీరు నుంచి రుండలంపుట్టు వరకు రూ.15 లక్షలతో రోడ్డు నిర్మాణం, పెదలోవ గ్రామ సమీపంలో రూ.35 లక్షలతో కల్వర్లు నిర్మాణం, రూ.15 లక్షలతో పాత రూడకోటలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి

రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆనుకుని డాక్టర్ క్వార్టర్స్‌కు రూ.35 లక్షలు, స్టాఫ్ క్వార్టర్స్ రూ.30 లక్షలు, గర్భిణుల కోసం బర్త్ వెయిటింగ్ హాల్ రూ.25లక్షలతో నిర్మించారు. రూడకోట జంక్షన్‌లో అంబేడ్కర్ పార్కు సమీపంలో రూ.5 లక్షలతో బస్ షెల్టర్, రూ.5 లక్షలతో హాట్ బజార్ భవనం నిర్మాణం జరిగింది. గ్రామాలకు తాగునీటి కల్పనకు జల జీవన్ మిషన్ ద్వారా రూ.42 లక్షలతో తాగునీటి పథకాల నిర్మాణం కొన్ని పూర్తయింది. మిలిగినవి ప్రగతిలో ఉంది.

గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు



రూడకోట గ్రామ పంచాయతీలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీస అభివృద్ధి జరగలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీ సర్పంచ్ సురేష్‌కుమార్ చొరవతో గ్రామాలకు సీసీ రోడ్లు, తారురోడ్లు, గ్రావెల్ రోడ్లు, తాగునీటి సదుపాయం అందుబాటులో వచ్చింది.దశాబ్దాల కల కల్వర్టుల నిర్మాణం జరిగింది. పంచాయతీలో శివారు గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు దర్శనమిస్తున్నాయి. ఆనందంగా ఉంది.

– సొలగం సంధ్య, యువతి, పాత రూడకోట గ్రామం

పంచాయతీ మరింత పురోగతి



సీఎం జగన్ ప్రభుత్వంలో ఉన్నతాధికారులు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సహకారంతోనే పంచాయతీ అభివృద్ధికి బాటలు పడ్డాయి. అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కలిగింది. పంచాయతీలో రూ.6 కోట్ల నిధుల్లో రూ.3.33 కోట్ల నిధులతో పనులు జరిగాయి. ఆస్పత్రిలో డాక్టర్, సిబ్బంది క్వార్టర్స్‌తో పాటుగా బర్త్ వెయిటింగ్ హాల్ నిర్మాణం జరిగింది. వీధి దీపాలు ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసి మరింత పురోగతి సాధించేలా కృషి చేస్తాం.

– కాతారి సురేష్‌కుమార్, సర్పంచ్, రూడకోట పంచాయతీ, పెదబయలు మండలం

విస్తారంగా వేరుశనగ సాగు

- సాగుకు అనుకూలించిన వాతావరణం
- పంట దిగుబడిపై ఆశాభావంలో రైతులు



డీంభుగూడలో వేరుశనగ పంట

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డ పరీవాహక ప్రాంతాల్లో గిరిజనులు విస్తారంగా వేరుశనగ పంట సాగును చేస్తున్నారు. పంటకు వాతావరణం సైతం అనుకూలించడం సాగు పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. ముంచంగిపుట్టు మండలంలో ఏటా ఏప్రిల్, మే నెలల్లో దార్రెల, సుజనకోట, పెదగూడ, వనుగుమ్మ, పనసపుట్టు, మాకవరం, దొడిపుట్టు పంచాయతీల్లో వందల ఎకరాల్లో గిరిజనులు వేరుశనగ పంటను వేస్తారు. గతంలో అప్పులు చేసి పంట వేసే గిరిజనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక చేయూత ఇవ్వడం, రాయితీపై విత్తనాలు అందుబాటులో ఉంచడం రైతులకు కలిసొచ్చింది. దీంతో ఒక్క ఏడాదిలో గిరిజన రైతులు రెండు దఫాలు వేరుశనగ పంటను పండిస్తున్నారు. దీనికి తోడు వర్షాకాలంలోనే కాకుండా ఎండాకాలంలోనూ చెదురుముదురుగా వర్షాలు కురవడం రైతులకు అన్ని విధాలా కలిసి వచ్చింది. కొన్నిచోట్ల మత్స్యగెడ్డ నీటిని వాడుకుంటూ పంటను పండిస్తున్నారు. ప్రస్తుతం మత్స్యగెడ్డ పరీవాహక గిరిజన గ్రామాల్లో గిరిజనులు వేరుశనగ పంటను సాగు చేసే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వేరుశనగ పంట పొలాల్లో కుటుంబ సభ్యులందూ ఎరువులు జల్లుతూ, నీరందించే పనుల్లో ఉన్నారు. కొన్ని గ్రామాల్లో వేరుశనగ పంట చేతికి రావడంతో వేరుశనగను ఉడకబెట్టి సంతలో గ్లాసు లెక్క రూ.20 నుంచి రూ.50 వరకు గిరి రైతులు అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో పాటు పచ్చి వేరుశనగ సైతం బస్తాల లెక్కల్లో అమ్మకాలు చేస్తున్నారు. మైదాన ప్రాంతంతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి అధికంగా కొనుగోలు చేస్తు వేరుశనగను లారీలు, వ్యానులలో తరలిస్తున్నారు. వేరుశనగ సాగు పెరగడం, ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దోమల మందు పిచికారీ చేసుకోవాలి



దారపల్లిలో దోమల నివారణ మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: ఇళ్ల లోపల బయట దోమల నివారణ పిచికారీ తప్పనిసరిగా చేయించుకోవాలని కిలగాడ వైద్యాధికారి రమేష్ అన్నారు. అన్నారు. మండలంలో గల కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి గ్రామంలో మొదట విడత మలేరియా దోమల నివారణ మందు పిచికారీలో భాగంగా బుధవారం వైద్యాధికారి రమేష్ పర్యవేక్షణలో ఇళ్ల లోపల, బయట పిచికారీ చేయించారు. అనంతరం దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో లబ్బూరు, కిలగాడ పీహెచ్‌సీ పరిధిలోని 128 గిరిజన గ్రామాలకు ముందస్తుగా గుర్తించిన దోమల నివారణ పిచికారీ చేస్తామన్నారు. ఇప్పటివరకు 50 గ్రామాల్లో పిచికారీ పూర్తయిందని, గిరిజనులంతా వైద్య సిబ్బందికి సహకరించి ,ఇళ్ల లోపల ఖచ్చితంగా పిచికారీ చేసుకోవాలని ఆయన కోరారు. సర్పంచ్ సుభాష్‌చంద్ర, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు, ఎంపీహెచ్ ఈవో కె. సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ అశోక్, ఆశా కార్యకర్తలు,వార్డు సభ్యులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు



జూనియర్ కళాశాలగా మారిన ప్రభుత్వ పాఠశాల

కొయ్యూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈవో, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు బుధవారం తెలిపారు. దరఖాస్తులను కళాశాల సిబ్బంది లేదా తమకు అందజేయాలని ఆయన సూచించారు. ప్రతీ గ్రూపునకు 40 మంది చొప్పున మంజూరైన ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జూన్ మొదటి తేదీ నుంచి కళాశాల ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మొత్తం 80 మందిని ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. పది ఉత్తీర్ణత సాధించిన వారంతా మొదటి సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు చేయాలన్నారు.అదనపు భవనాల నిర్మాణం నేపథ్యంలో పాఠశాల, కళాశాల నిర్వాహణకు సమయంలో మార్పులు ఉండవన్నారు.

విద్యుత్ షాక్‌కు పశువులు మృతి



సిర్లిమెట్టలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రెండు ఆవులు



ఎగరాపల్లిలో విద్యుత్ షాకుకు గురై మృతి చెందిన ఎద్దు

ముంచంగిపుట్టు: మండలంలో గల కుమడ పంచాయతీ సిర్లిమెట్ట గ్రామ సమీపంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లు అంటుకొని రెండు ఆవులు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సిర్లిమెట్ట గ్రామానికి చెందిన వంతాల ముపునా, కిల్లో రాందాసుల ఆవులు బుధవారం ఉదయం ఆవుల శాల నుంచి మేత కోసం వదిలారు. ఆవులు రెండు కొండప్రాంతం వైపు వెళ్తుండగా మంగళవారం రాత్రి ఈదురు గాలులకు తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లను అంటుకున్నాయి. దీంతో విద్యుత్ షాకుకు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. ఆవులు మృతి చెందిన ప్రదేశం నుంచి మంటలు వస్తుండడంతో దీనిని గమనించిన సిర్లిమెట్ట గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించి విద్యుత్‌ను నిలుపుదల చేశారు. వారం రోజుల క్రితమే ఒక్కొక్క ఆవును రూ.30 వేలు చొప్పున కొన్నామని, ఇప్పుడు ప్రమాదంలో మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయామని, అధికారులు తమను ఆదుకోవాలని బాధిత రైతులు రాందాసు, ముపునాలు కోరారు.

జి.మాడుగుల: మేతకు వెళ్లిన పశువుపై విద్యుత్ తీగ తెగిపడటంతో షాక్‌కు గురై అక్కడకక్కడే మృతి చెందింది. ఈ సంఘటకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం ఎగరాపల్లి గ్రామానికి చెందిన గూడ పెద్దగున్నడుకు చెందిన ఎద్దు మెతకు వెళ్తున్న సమయంలో విద్యుత్‌తీగ తెగిపడడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడకక్కడే మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన ఎద్దు సుమారు రూ.50వేలు ఉంటుందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించిన పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు పెద్ద గున్నిడి కోరారు.

ఏకలవ్య పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య పాఠశాలలో ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్స్‌పాల్ ఎం.వి.కృష్ణారావు తెలిపారు. సెంట్రల్ సిలబస్‌తో జరిగిన పదో తరగతి పరీక్షలకు 59 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణలయ్యారని పేర్కొన్నారు. దూరుపల్లి నిషిత శ్రీ సౌభాగ్య అనే విద్యార్థిని 600 మార్కులకు గాను 439 మార్కులతో పాఠశాలలో ఫస్ట్ ర్యాంకు సాధించినట్టు తెలిపారు.

గిరిజన ఓటర్ల చైతన్యం అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: మన్యంలోని మారుమూల గిరిజన ఓటర్లు చైతన్యంతో పోలింగ్‌లో పాల్గొనడం అభినందనీయమని జి.మాడుగుల సీఐ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ మండలంలోని భూసిపుట్టు, రంగబయలు, బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల్లో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతాలు పెరిగాయన్నారు. ఓటు హక్కును వినియోగించేందుకు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వచ్చిన గిరిజనులు గంటల కొద్దీ క్యూలైన్‌లో నిరీక్షించి మరీ ఓటు వేయడం జరిగిందన్నారు. గతంతో పోలిస్తే మారుమూల గిరిజన గ్రామాల పరిస్థితులు పూర్తిగా మారాయని, ఓటు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకున్నారన్నారు. గిరిజన అభివృద్ధి కోసం పోలీసుశాఖ నిరంతరం పని చేస్తుందని స్పష్టం చేశారు. ఎస్‌ఐ రవీంద్ర, సిబ్బంది ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వంతెనపై పడిన రంధ్రాన్ని చూపిస్తున్న స్థానికులు

అనంతగిరి: మండలంలోని కొదంగూడ–కరవలస గ్రామాల మధ్యలోని గెడ్డపై ఉన్న భారీ వంతెనకు ప్రమాదం పొంచి ఉందని, వెంటనే అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని, టోకూరు సర్పంచ్ మోస్య, స్థానిక గిరిజనులు కోరారు. అరకు–విశాఖ ప్రధాన రహదారి కావడంతో తరచూ వందలాది సంఖ్యలో వాహనాలు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగుతుంటాయని చెప్పారు. రక్షణ గోడ వద్ద పెద్ద రంధ్రం ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని, ప్రమాదవశాత్తూ వంతెన కూలిపోతే రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌శాఖ అధికారులు స్పందించి, మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేడు ఉత్సవాలకు అంకురార్పణ
- ముస్తాబైన పెందుర్తి వెంకటాద్రి



వెంకటాద్రి

పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమి మీద అడుగిడిన పవిత్ర రోజు వైశాఖ శుద్ధ దశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశమి(శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేనపూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీసులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తామైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎండ తీవ్రతతో వేతనదారుల అస్వస్థత



రాజవొమ్మంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సోమరాజు

రాజవొమ్మంగి: మండలంలో వేరు వేరు చోట్ల ఉపాధి హామీలో చెరువు తవ్వకాల పనులకు వెళ్లిన వేతన దారులు ఎండతీవ్రతకు అస్వస్థతకు గురై స్పృహతప్పి పని ప్రదేశంలోనే పడిపోయారు. మండలంలోని తంటికొండ పంచాయతీ ఒట్టిగెడ్డ గ్రామానికి చెందిన బొడ్డు సత్యవతి (51) వడగాడ్పులకు సొమ్ముసొల్లింది. అదే విధంగా మండలంలోని చినరెల్లంగిపాడు గ్రామానికి చెందిన కరక సోమరాజు (65) కూడా పని ప్రాంతంలో అస్వస్తతకు గురై కింద పడిపోయాడు. వీరిని కుటుంబీకులు రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందజేసినట్లు ఉపాధి ఏపీఓ సురేష్‌కుమార్ తెలిపారు. కాగా సత్యవతి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఆమె కుటుంబసభ్యులు చెప్పారు.

చీటీల పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

మునగపాక : చీటీల పేరుతో మోసం చేసిన మండలంలోని వాడ్రాపల్లికి చెందిన కొయిలాడ సత్యనారాయణను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు తెలిపారు. సత్యనారాయణ స్థానికంగా చీటీలు నిర్వహిస్తూ ఉండేవారు. వాడ్రాపల్లి, నాగవరం, కుంచవానిపాలెం, మల్లవరం, మునగపాక తదితర ప్రాంతాలకు చెందిన వారితో నమ్మకంగా చీటీలు నిర్వహించేవాడు. ఇతని మాటలు నమ్మిన పలువురు సత్యనారాయణ వద్ద చీటీలు కట్టేవారు. అయితే చీటీల సమయం ముగిసినా నగదు ఇవ్వకపోవడంతో పలుమార్లు సత్యనారాయణను నిలదీశారు. అయినప్పటికీ సత్యనారాయణ నుంచి చీటీల నగదు రాకపోవడంతో బుధవారం తెల్లవారి తమ చీటిల సొమ్ము తమకి ఇవ్వాలని అతన్ని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రసాదరావు వాడ్రాపల్లికి చేరుకుని సత్యనారాయణను మునగపాక పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. వాడ్రాపల్లికి చెందిన దాడి భాస్కరరావుతో పాటు మరో ఏడుగురు బాధితులు చీటీల ద్వారా తమకు రూ. 25 లక్షలకు పైగా నగదు ఇవ్వాల్సి ఉందని, న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి సత్యనారాయణను రిమాండ్‌కు తరలించారు. కాగా బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

రైలు నుంచి జారి వ్యక్తి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి–యలమంచిలి రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాల ప్రకారం.. విజయవాడ–అనకాపల్లి మార్గంలో నరసింగబిల్లి వద్ద గుర్తు తెలియని రైలు నుంచి ఒక వ్యక్తి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నేరేడు పండు రంగుపై పచ్చ రంగు నిలువు చారల చొక్కా, నలుపు రంగు ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అవి చిరిగి ఉన్నాయి. ఇవి తప్ప ఎటువంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి బంధువుల కోసం భద్రపరిచామని ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ కోసం తుని రైల్వే పోలీసు స్టేషన్‌నులో గాని, 9494887786, 9490619020 సెల్ నంబర్లు గాని సంప్రదించాలని తెలిపారు.